# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 90 | EDITOR:CHERUKU UPENDAR, | DATE : TUESDAY 01 AUGUST 2023 | PAGES:4, | RATE: Rs.5/-

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక : 90 | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | తేదీ : మంగళవారం 01 ఆగస్టు 2023 | పేజీలు : 4 | వెల : 5/-


## జేపీ నడ్డాతో బండి సంజయ్ భేటీ

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ భేటీ అయ్యారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జేపీ నడ్డాకు కండువా కప్పి

మిగతా 2లో...

## చాణుక్య ప్రదర్శనతో.. పార్టీలకు గులాబీ ఉక్కపోత..!

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

- కేసీఆర్ వ్యూహాలకు ప్రతిపక్షాల మైండ్ బ్లాక్
- ఆయన రాజకీయ లక్ష్యం తెలంగాణయే
- కాంగ్రెస్‌ను 'చిన్నాభిన్నం'చేసే పనిలో కేసీఆర్
- ముందుగా కేసీఆర్ గాలానికి చిక్కిన అనిల్ కుమార్ రెడ్డి
- మూడోసారి గెలిచేందుకు మాత్రమే ఆయన జాతీయ నినాదం
- రహస్యంగా ప్రారంభించిన 'ఆపరేషన్'

'ప్రత్యర్థులను బలహీనపరచడం మన విజయానికి కీలక మెట్టు అవుతుంద'ని రాజనీతి శాస్త్రం చెబుతోంది. ఈ శాస్త్రాన్ని కాచివడబోసిన కేసీఆర్ 2014 నుంచి ఇలాంటి వ్యూహాన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నారు. దాంతో తన దరిదాపుల్లో ఎవరూ లేకుండా చేసుకోగలిగారు. అలాగే తనకు సమఉజ్జీగా మరొకరు తయారవకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా మరికొందరు కాంగ్రెస్ ముఖ్యులకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల విసిరారు. ఇప్పటివరకు కేసీఆర్ గాలానికి చిక్కని రాజకీయ నాయకులంటూ లేరు. అంత అద్భుతమైన ఎత్తుగడలతో ఆ 'గాలం' ఉంటుంది. ఉత్తమ్ కుమార్ రెడ్డి శిష్యుడు, భువనగిరి డీసీసీ అధ్యక్షుడు, అర్థబలం పుష్కలంగా ఉన్న కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముందుగా కేసీఆర్ గాలానికి చిక్కారు. మరికొందరు కూడా అదే దారిలో ఉన్నారు. పొత్తుల ప్రతిష్టంభనకు కారణం ఏమిటి? తెలంగాణలో కేసీఆర్ వ్యూహాలకు ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అవుతోంది. నిజానికి ఏ రాజకీయ పార్టీ అయినా బలపడాలన్నా, బలహీన పడాలన్నా ఆ పార్టీ విధానాలు, ప్రజల మద్దతు,

మిగతా 2లో...

## సీబీఐ, సిట్‌కు దర్యాప్తు అప్పగించినంత మాత్రన సరిపోదు

బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా చూడాలి

కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు


హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మహిళలపై మే ప్రారంభం నుంచి జరుగుతున్న అమానుషాలపై ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని కేంద్రాన్ని సుప్రీంకోర్టు సోమవారం నాడు నిలదీసింది. సీబీఐ, సిట్‌కు దర్యాప్తు అప్పగించినంత మాత్రన సరిపోదని, బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా చూడాలని, ఇప్పటికే మూడు నెలలు గడిచిపోయాయని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.

మిగతా 2లో...

## రాజకీయాలంటే వ్యాపారం కాదు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి

కమిషన్ తీసుకున్నానని ఎవరైనా అంటే రాజకీయాల నుంచి తక్షణం రిటైర్ అవుతా



ముంబై - ప్రభాత సూర్యుడు

రాజకీయాలంటే వ్యాపారం కాదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. కమిషన్‌గా తాను ఏరోజూ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని చెప్పారు.

మిగతా 2లో...

## గులాబీ గూటికి మరాఠ నేతలు

బీఆర్ఎస్ పార్టీని విస్తరించేందుకు అనేక వ్యూహాలు

ముంబై - ప్రభాత సూర్యుడు



ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని విస్తరించేందుకు అనేక వ్యూహాలు రచిస్తున్నారు. పలు రాష్ట్రాలకు చెందిన నాయకులను కలుపుకునే పనిలో ఉన్నారు. ముఖ్యంగా ఇటీవల మహారాష్ట్రకు ఆయన ఎక్కువగా వెళ్తూ అక్కడి నాయకులను తమ పార్టీ వైపు తిప్పుకుంటున్నారు. తాజాగా మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల్లోని నాయకులు చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. అదే రాష్ట్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, చక్కెర కర్మాగారాల యజమాని.. మరాతా ధన్‌కర్ సామజిక వర్గంలో పట్టున్న బాలాసాహెబ్ కన్నవార్ బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే ఉస్మానాబాద్ జిల్లాకు చెందిన రైతు ఉద్యమ నాయకుడు కిషన్ హరిశ్చంద్ర కశీద్, పలువురు శివనేతలు చేరారు. మరోవైపు ఉస్మానాబాద్ జిల్లా ఆర్ఎస్పీ ప్రెసిడెంట్ ఓంకార్ నికమ్, కాంగ్రెస్ నాయకుడు విశ్వజిత్ షిండే బీర్ఎస్ కండువా కప్పుకున్నారు. అలాదే ఆర్ఎస్పీ మహారాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మాణిక్ పోలా, ఛత్రపతి సేన రాష్ట్ర అధ్యక్షుడు రోహిత్ బాహూ మాల్మే తదితరులు పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ సమక్షంలో జరిగిన ఈ పార్టీ చేరికలో సమావేశంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇంఛార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు, స్టీరింగ్ కమిటీ సభ్యుడు శంకరన్న డోందే తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ మహారాష్ట్రలో తమ పార్టీని

మిగతా 2లో...

## వలస బాట పడుతున్న మణిపూర్ వాసులు




ఇంపాల్- ప్రభాత సూర్యుడు

మణిపూర్‌లో హింసను తట్టుకోలేక చాలా మంది రాష్ట్రం వదిలి వెళ్లిపోతున్నారు. పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. మిజోరంకి వేలాది మంది వలస వెళ్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే 5 వేల మంది కుకీలు భయంతో మణిపూర్‌ని వదిలి నాగాలాండ్‌కి వెళ్లారు. అక్కడే ఆశ్రయం పొందుతున్నారు. అయితే...అక్కడ ప్రత్యేకంగా వీళ్ల కోసం అంటూ రిలీఫ్ క్యాంప్‌లు ఏమీ లేవు. ఫలితంగా...ఎక్కడో ఓ మారుమూల గ్రామంలో తలదాచుకుంటున్నారు. ఇలా వలస వెళ్లిన వారిలో

మిగతా 3లో...

## టెట్.. సెట్‌లకు అంతా రెడీ




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో మరోసారి టెట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ మరో వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్ లో పరీక్ష నిర్వహిస్తారని తెలుస్తోంది. తెలంగాణలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నడుస్తోంది. అయితే డీఎస్సీ పై ఇప్పటి వరకు మాత్రం ఎలాంటి అప్డేట్ లేదు. గతేడాది టెట్ పరీక్ష నిర్వహించిన విద్యాశాఖ... వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందని అంతా భావించారు. కానీ ఇప్పటి వరకు ప్రకటన జారీ కాలేదు. ఇప్పటికే టెట్ పరీక్ష నిర్వహించి... ఏడాది పూర్తి అయింది. దీంతో మరోసారి టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్

మిగతా 2లో...

## క్రాస్ రోడ్స్‌లో షర్మిళ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల సోషల్ మీడియాలో పోస్టులకే పరిమితమయ్యారు. ఇటీవల ఆమె క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లడం లేదు. సొంత పార్టీ పెట్టుకుని మూడు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసినా రావాల్సినంత హైప్ రాకపోవడంతో ఆమె కూడా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నదానిపై స్పష్టత లేకుండా ఉన్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ట్వీట్లు తప్ప మరేమీ రాజకీయ కార్యకలాపాలు కనిపించడం లేదు. పాలేరులో పోటీ చేస్తానని చెబుతున్నా.. ఎన్నికలు దగ్గర పడుతున్నా అక్కడకు వెళ్తోంది కూడా తక్కువే. దీంతో షర్మిల పయనం ఎటు వైపనే చర్చ తెలంగాణ రాజకీయాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ లో విలీనం అంటూ కొంత కాలం హడావుడి జరిగింది. కాంగ్రెస్ సీనియర్లు మాత్రం ఆమె అసలు తెలంగాణ పార్టీకి అవసరం లేదని.. ఏపీకి అవసరం అయితే విలీనం చేసుకోవాలని తేల్చేశారు. దీంతో ఆమె విలీనం పెండింగ్ లో పడిపోయిందని చెబుతున్నారు. డీకే శివకుమార్ ద్వారా హైకమాండ్ పై ఒత్తిడి తెచ్చినప్పటికీ పలితం సానుకూలంగా రాలేదని చెబుతున్నారు. కాంగ్రెస్ లో విలీనం చేస్తే పాలేరు టిక్కెట్ కూడా ఇచ్చేది లేదని .. అసలు తెలంగాణ రాజకీయాల్లో అంగీకరించబోమని .. కాంగ్రెస్ సీనియర్లు తెగేసి చెబుతున్నట్లుగా తెలుస్తోంది. పార్టీలో ఒక్కరంటే ఒక్క ప్రముఖ నాయకుడు కూడా లేరు. నియోజకవర్గ స్థాయి నేత కూడా లేరు. ఆమె పాలేరులో పోటీ

మిగతా 2లో...

## పేదలకు ఇండ్లు అందించేవరకు పోరాటం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మహబూబ్ నగర్ లో జరిగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ ర్యాలీ లో పాల్గొనేందుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మహబూబ్ నగర్ బయలుదేరారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ పేదల కల.. డబుల్ బెడ్రూం ఇండ్లు పేదలకు అందించే వరకు మా పోరాటం

మిగతా 3లో...

## సీబీఐ, సిట్‌కు దర్యాప్తు

# అప్పగించినంత మాత్రన సరిపోదు

(మొదటిపేజీ తరువాయి)

ఇంతవరకూ ప్రభుత్వం ఏమి చేసిందనే దానిపైనే సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే విషయం ఆధారపడి ఉంటుందని, ప్రభుత్వ చర్యలతో సంతృప్తి చెందినట్లయితే తాము జోక్యం చేసుకోవాల్సి అవసరం ఉంటుందని సీజేఐ అన్నారు. దీనిపై కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదన వినిపిస్తూ, మణిపూర్ హింసపై జరుగుతున్న విచారణను సుప్రీంకోర్టు పర్యవేక్షించేందుకు కేంద్రానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. సీజేఐతో పాటు జేబీ పార్ధివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ముందు మణిపూర్ హింసకు సంబంధించిన పలు పిటిషన్లు విచారణకు వచ్చాయి. వీటిపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. మే 4న విడుదలైన వీడియోలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఆ ఇద్దరు బాధిత మహిళల తరఫున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబాల్ వాదన వనిపించారు. ఈ కేసును సీబీఐ విచారించాలన్న కేంద్రం అభిప్రాయంతో పాటు, అసోం రాష్ట్రానికి కేసు బదిలీ చేయాలన్న విషయంలోనూ బాధిత మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారని, ఇందుకు వారు అంగీకరించడం లేదని సిబాల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై తుషార్ మెహతా స్పందిస్తూ, అసోంకి కేసును బదిలీ చేయాలని తాము చెప్పలేదన్నారు. వేరే రాష్ట్రమని మాత్రమే ప్రస్తావించామని తెలిపారు. సీబీఐ విచారణను సిబాల్ వ్యతిరేకిస్తూ, అసోంకి కాకుడా వేరే రాష్ట్రానికి కేసు బదిలీ చేయాలన్నారు. మణిపూర్‌లో లైంగిక వేధింపులు ఆగలేదని, రిలీఫ్ క్యాంపులు దారుణంగా ఉన్నాయని, శాంతిభద్రతలను తిరిగి పాదుకొలపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. బాధితులు పదేపదే కోర్టుకు రాలేరని, విచారణకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టును కోరారు.

### ప్యాకేజీ ప్రకటించారా?

దీనిపై సీబీఐ స్పందిస్తూ, మే 3వ తేదీ నుంచి అల్లర్లు మొదలయ్యాయని అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారో చెప్పాలని, మణిపూర్‌లో ఇళ్ల పునర్నిర్మాణానికి కేంద్రం ఎలాంటి ప్యాకేజీ ప్రకటించిందని ప్రశ్నించారు. సీఐకి, సిట్‌కు కేసును అప్పగించిన మాత్రన సరిపోదని, బాధితులకు నేరుగా, సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. మణిపూర్‌లో ఇటువంటి ఘటన (వీడియో ఘటన)లు ఒకటి మాత్రమే జరగలేదని, మహిళలపై హింస విషయంలో విస్తృత యంత్రాగాన్ని రూపొందించాలని ఆదేశించింది. బాధిత మహిళలు, మహిళా న్యాయమూర్తులు, డొమైన్ ఎక్స్‌పర్ట్‌లతో ఒక కమిటీ వేయడం ఒక మార్గమని అన్నారు. దీనిపై సిబాల్ స్పందిస్తూ, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు సాగాలని ధర్మాసనాన్ని కోరారు. ఈ విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఎస్‌జీ తుషార్ మెహతా కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది.

# రాజకీయాలంటే వ్యాపారం కాదు

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ తీసుకున్నానని ఎవరైనా అంటే రాజకీయాల నుంచి తక్షణం రిటైర్ అవుతానని అన్నారు. తన చిన్ననాటి ముచ్చట్లు, తన అభిరుచులు, ఇవాల్టి రాజకీయాలతో సహా పలు ఆసక్తికరమైన విషయాలను ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. హిందీ, మరాఠీ, ఆంగ్లంలో తన ప్రసంగిస్తుంటానని, ప్రజలు తన ప్రసంగాలను యూట్యూబ్‌లో వింటుంటారని గడ్కరి తెలిపారు. అమెరికాలో ఎక్కువ మంది తన ప్రసంగాలు వింటుంటారని, ప్రతి నెలా యూట్యూబ్ నుంచి తనకు రూ. 3 లక్షల వరకూ వస్తుందని చెప్పారు. భగవంతుడికి తనపై ఎంతో కరుణ ఉందని అన్నారు. ఏమాటైనా ముక్కుకు సూటిగా చెప్పడానికే తాను ఇష్టపడతానని తెలిపారు. ఉద్యోగం చేయడం కంటే, పదిమందికి ఉద్యోగం కల్పించాలనే ఆలోచన తనకు చిన్నప్పటి నుంచి ఉందని, తన తల్లిదండ్రులు లాయర్‌గా చూడాలని కోరుకున్నప్పుడు తాను ఇదే విషయం వారికి చెప్పానని గుర్తుచేసుకున్నారు. కులం, మతం, భాష పేరుతో ఎవరూ గొప్పవాళ్లు కారని, ప్రవర్తన-లక్షణాల వల్లే ఎవరైనా గొప్పవాళ్లవుతారని అన్నారు.

### కుల రాజకీయాలకు వ్యతిరేకం

కులం గురించి తాను ఎప్పుడూ మాట్లాడనని, తాను ఒక నేతనని, తనకు అన్ని కులాల ఓట్లు కావాలని. అందరూ తనకు సోదరులైనని అన్నారు. కులం గురించి మాట్లాడే వాళ్లను దూరంగా ఉంచమని తాను చెబుతుంటానని తెలిపారు. ఇవాళ తాను ఎలాంటి బిజినెస్ చేయడం లేదని, ఇంతవరకూ చేసిన బిజినెస్ రెండున్నర వేల కోట్ల టర్నోవర్ ఉంటుందని చెప్పారు. తాను బిజినెస్ ప్రారంభించినప్పుడు 15,000 మందికి ఉద్యోగాలు ఇచ్చానని, వారిలో కనీసం 200 మంది తన కులానికి చెందిన వారు కారని అన్నారు. ఇవాళ రాజకీయాల్లో తమ వారికే టిక్కెట్లు ఇచ్చేకునే పరిస్థితి ఉందని సూటిగా చెప్పారు.

## చాణుక్య ప్రదర్శనతో...

# పార్టీలకు గులాబీ ఉక్కపోత

(మొదటిపేజీ తరువాయి)

ఇతరత్రా కారణాలను బట్టి ఉంటుంది. కానీ తెలంగాణలో అలా లేదు.ఏ పార్టీ సైజు ఎంత ఉండాలి? ఏ పార్టీ ఎంత ఎత్తు వరకు మాత్రమే ఉండాలి? ఆ పార్టీలు ఎప్పుడు ఎలాంటి వైఖరి తీసుకోవాలి? ప్రతిపక్షాల పోరాటాలు ఏ రూపాల్లో ఉండాలి? ఆ పోరాటాలను అవి ఎంత దూరం తీసుకువెళ్లి ముగింపు పలకాలి? వంటి అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయిస్తారు. ఏ పార్టీ ఏ సమయంలో ఎలా పుంజుకోవాలో, ఏ సమయంలో అది చితికిపోవాలో ఆయనే నిర్ణయిస్తారు. ఇది అతిశయోక్తి కాదు. గడిచిన తొమ్మిదేళ్లుగా తెలంగాణ రాజకీయాలను, రాజకీయ పార్టీల బలాబలాలను దగ్గరగా చూస్తున్న వారికి తప్ప మిగతావాళ్లకు అర్థం కాదు అలాంటి చాణక్య ప్రదర్శనలో కేసీఆర్ దిట్ట 2014 తర్వాత టిడిపిని తుడిచిపెట్టే ఆపరేషన్ పూర్తయ్యింది. అప్పుడే కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే వ్యూహాలకు కేసీఆర్ పదునుపెట్టారు. కొంత మందిని నాటి టిఆర్ఎస్ లోకి లాగేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ తరపున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలకు గాలం వేసిన టిఆర్ఎస్ విజయవంతమైంది. ఈటల రాజేందర్ బహిష్కరణ, బీజేపీ నుంచి హుజురాబాద్ లో మళ్ళీ గెలవడం, గ్రేటర్ హైదరాబాద్ లో బీజేపీ అనూహ్య పెర్ఫార్మెన్స్ కేసీఆర్ కు ముందే తెలుసు. ఈటల రాజేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరకుండా కేసీఆర్ రహస్యంగా 'ఆపరేషన్' చేసినట్టు అప్పట్లో ఊహాగానాలు వెలువడ్డాయి. అందులో నిజమెంతో తెలియదు కానీ.. కేసీఆర్ అలాంటి చాణక్యాన్ని ప్రదర్శించడంలో దిట్ట. ఎవరు ఏ పార్టీలో చేరాలో, చేరితే ఏమి చేయాలో, మళ్ళీ వారు పార్టీ మారాలంటే ఏ పార్టీలో చేరాలి?వంటి వ్యవహారాలను కేసీఆర్ పర్యవేక్షిస్తారన్న ప్రచారం కూడా ఉంది. మునుగోడు ఉపఎన్నికకు ముందు వరకు తెలంగాణ 'రణస్థలి'లో బిఆర్ఎస్ కు బీజేపీ ప్రధాన ప్రత్యర్థి కాగలదని ఒక 'వాతావరణం'ఏర్పడింది. అందుకు కేసీఆరే కారణం. ఆ వాతావరణం ఏర్పాటుకు గాను కేసీఆర్ రచించిన వ్యూహాలు ఫలించినవి. అయితే ఆయన అంచనాలను దాటి బీజేపీ ముందుకు దూసుకుపోతున్నట్టు పసిగట్టిన వెంటనే దానిని కట్టడి చేయడంలో భాగంగానే 'నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలు కేసు' వెలుగులోకి తీసుకు వచ్చి బీజేపీని నైతికంగా దెబ్బతీయగలిగారు. బీజేపీ సైజు పెరుగుతుండడం వల్ల దాన్ని కత్తిరించేందుకు కేసీఆర్ ప్రయత్నించారు.అక్కడి నుంచి క్రమంగా బీజేపీ ప్రయాణం ఎత్తు, పల్లాలతో సాగుతున్నది.ఆ పార్టీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు, గ్రూపు రాజకీయాలు ఊపందుకున్నవి. ఇది కేసీఆర్ పుణ్యమేనని బీజేపీ అనుమానం. బిజెపిలో అంతర్గత కలహాలు,అయోమయ వాతావరణానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారంటూ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు జితేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. మరో పార్టీ నాయకుడు ప్రయత్నిస్తే బీజేపీలో కలకలం ఎట్లా చెలరేగుతుంది? బండి సంజయ్ మార్పు, కిషన్‌రెడ్డి అధ్యక్ష పదవి చేబట్టడం వెనుక బీజేపీ నిర్ణయమేనా? ఆ నిర్ణయాన్ని ప్రభావితం చేసిన వారు ఎవరు? బీజేపీ 'లోపలి విషయాలు' తెలిసిన వారికి మాత్రమే అర్థమవుతాయి. దీన్ని బట్టి బిజెపి ఎంత డొల్లగా ఉన్నదో తేటతెల్లమవుతున్నది. ఇక కర్ణాటక ఫలితాల తర్వాత సీన్ మారింది.కాంగ్రెస్ లో ఉత్సాహం, ఉత్తేజం కనిపిస్తున్నవి. కర్ణాటక ఎన్నికలలో అనుసరించిన 'మోడల్'ను తెలంగాణలో అమలు చేయడానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తరచూ బెంగళూరు వెళ్లి అక్కడి ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్ దగ్గర 'షార్ట్ టర్మ్ కోచింగ్' తీసుకొని వస్తున్నారు. ఇదంతా గమనిస్తున్న కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని 'చిన్నాభిన్నం'చేసే పనిలో ఉన్నారు. ఆయన ప్రసంగాలు కాంగ్రెస్ ను కేంద్రబిందువుగా చేసుకునే సాగుతున్నవి. విభజనకు ముందే అధ్యయనం తెలంగాణ పునర్నిర్మాణం లేదా తెలంగాణ పునరేకీకరణ అని పేర్లు పెట్టినా అంతిమంగా 'ప్రతిపక్ష ముక్త తెలంగాణ' కావాలన్నది కేసీఆర్ అభిలాష. 'ఒక రాష్ట్రం – ఒకే పార్టీ' అనే సిద్ధాంతమూ అమలు చేయాలని అనుకుంటూ ఉండవచ్చు. తెలంగాణ అవతరించకముందే ఇక్కడి ప్రజల ప్రాథమిక అవసరాలు ఏమిటో, రాజకీయ పార్టీలు.. అందులోని నాయకుల అవసరాలు, 'బలహీనతలు 'పూర్తిగా అధ్యయనం చేసిన, అవపోసన పట్టిన రాజనీతి 'ప్రొఫెసర్' కేసీఆర్. అసలు రాజనీతి ప్రొఫెసర్ గా ఉద్యోగం చేసిన కోదండరామ్ తెలంగాణ జనసమితి పార్టీని స్థాపించినా ఆ పార్టీ పుంజుకోలేకపోయింది. తనకు విధేయులైన వాళ్లకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వాలో, తనకు గిట్టని వాళ్ళను ఎలా అణచివేయాలో బిఆర్ఎస్ నిర్మాతకు తెలిసినంతగా దేశంలో మరే రాజకీయ నాయకునికి తెలియకపోవచ్చు. సాధారణంగా కాంగ్రెస్ బలహీన పడిన చోట బీజేపీ లేదా ప్రాంతీయ పార్టీలు బలపడుతుంటాయి. కాంగ్రెస్ నిర్వీర్యమైన ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ బలపడలేకపోయింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్ఆర్‌సీపీ పూర్తిగా బలం పుంజుకుంది. జాతీయపార్టీలు కాంగ్రెస్, బీజేపీలను జగన్ తుడిచిపెట్టేశారు. తెలుగుదేశం ప్రాంతీయపార్టీ కనుక బతికి బట్టకడుతోంది. ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్యనే పోటీ కేంద్రీకృతమైంది. టిడిపితో మరో ప్రాంతీయపార్టీ జనసేన జట్టు కట్టబోతోంది. ఏపీ ముఖ్యమంత్రి జగన్ కూడా 'కేసీఆర్ స్కూల్ ఆఫ్ థాట్ కు చెందిన నాయకుడే'! కేసీఆర్, జగన్ ఇద్దరి సిలబస్ ఒక్కటే! కాకపోతే జగన్ విద్యార్థి దశలో ఉంటే కేసీఆర్ ప్రిన్సిపాల్ దశ దాటేశారు. తెలంగాణ, తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలను ప్రాంతీయ పార్టీలు అడ్డుకుంటున్నాయి. ఒడిశా, ఏపీ ముఖ్యమంత్రులు నవీన్ పట్నాయక్, జగన్ బీజేపీకి స్నేహపూర్వకంగా లేదా తటస్థంగా మెలుగుతున్నారు. మమతా బెనర్జీ, కేసీఆర్, స్టాలిన్, నితీష్ కుమార్ తదితరులు బీజేపీకి ప్రత్యర్థులుగా అవతరించారు. కేసీఆర్ బిఆర్ఎస్ పేరిట జాతీయ పార్టీని ఏర్పాటు చేసినా ఆయన రాజకీయ లక్ష్యం తెలంగాణయే. తెలంగాణలో మూడోసారి గెలించేందుకు మాత్రమే ఆయన జాతీయ నినాదం వాడుకుంటున్నారని చాలా తక్కువమందికి అర్థమైంది. ప్రాంతీయ నాయకుడిగా ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ 'తెలంగాణ ప్రాంతీయ ఐడెంటిటీ' ని ఎన్నటికీ వదులుకోరు. అందుకే తమ పార్టీ పేరు మార్పు జరిగిందే తప్ప 'డిఎన్ఏ మారలేద'ని మంత్రి కేటీఆర్ ఇటీవలి కాలంలో తరచూ చెబుతున్నారు. బిఆర్ఎస్ పేరు వల్ల రాజకీయంగా నష్టం కలగకూడదని కేసీఆర్, కేటీఆర్ ప్రణాళిక. జాతీయ స్థాయిలో తన ప్రత్యర్థి బీజేపీ కనుక ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. విజయవంతమైన ప్రతి వ్యక్తికీ శత్రువుల గుంపు ఒకటి ఉండి తీరవలసిందేనని చరిత్ర చెబుతున్నది. శత్రువులు లేని వ్యక్తికి ఆత్మవిశ్వాసం, ధైర్యం.. రెండూ ఉండవు. కాలంతో పాటు కొట్టుకొనిపోయే సామాన్య మనుషుల మందలో అతనొకడుగా మిగిలిపోతాడు. ఒకప్పుడు కమ్యూనిష్టు పార్టీలను 'తోకపార్టీలు' అన్న కేసీఆరే వాళ్ళతో చేతులు కలపగలిగారంటే అది 'కామ్రేడ్ల' గొప్పతనం కాదు. కేసీఆర్ ఎత్తుగడ. మునుగోడు ఉపఎన్నికలో గెలవడమే ఆనాడు కేసీఆర్ టార్గెట్. కనుక ఉభయ కమ్యూనిస్టులతో మంతనాలు జరిపారు. 'ఇచ్చిపుచ్చుకున్నారు'. కేసీఆర్ తో కమ్యూనిస్టుల పొత్తు గురించిన 'భవిష్యత్తు చిత్రపటం' అందరికీ లీలగా కనిపించింది. కానీ మునుగోడు ఫలితం అనంతరం సిపిఐ,సిపిఎంలు డైలమాలో పడ్డాయి. వారిని కేసీఆర్ డోలాయమానంలో పడేశారు. కర్ణాటక ఫలితాలతో కామ్రేడ్లు కాంగ్రెస్ – బిఆర్ఎస్ మధ్య ఊగిసలాడుతున్నవి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడం రెండు పార్టీలకూ లక్ష్యం. కామ్రేడ్లు ఎవరితో పొత్తు పెట్టుకోదలచినా ఈ 'సానుకూలత' ఉన్నది. కానీ కామ్రేడ్ల లెక్కలు వేరు. అసెంబ్లీలో,శాసనమండలిలో కాలు మోపాలని ఆశిస్తున్నారు. అదే ఎజండాతో పనిచేస్తున్న 'కామ్రేడ్లు'.. ఎవరిద్వారా తమ ఆకాంక్ష నెరవేరుతుందో అటువైపే కమ్యూనిస్టులు మొగ్గు చూపే అవకాశం ఉంది.

# క్రాస్ రోడ్స్‌లో షర్మిళ

(మొదటిపేజీ తరువాయి)

చేయాలనుకుంటున్నారు. అక్కడ ఆమె కూడా నియోజకవర్గ స్థాయి నేతో కాదో ఎవరికీ తెలియడం లేదని తెలంగాణ రాజకీయ నేతలు సెటైర్లు వేస్తున్నారు. షర్మిల పార్టీ పెట్టిన కొత్తలో చాలా మంది నేతలు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపించారు. కానీ.. ఏపీ నుంచి వచ్చిన సూచనల్లాంటి హెచ్చరికలతో చాలా మంది డ్రాప్ అయిపోయారు.

పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా చేరుతామని సంకేతాలు పంపారు కానీ చివరికి వెనక్కి తగ్గారు. చేరిన ఒకరిద్దరు నేతలు చప్పుడు చేయడం లేదు. ఇప్పుడు కాదు డిసెంబర్‌లో ఎన్నికలు వచ్చినా షర్మిల పట్టుమని పది మంది గట్టి అభ్యర్థుల్ని నిలబెట్టలేని పరిస్థితి ఉందని ఎక్కువ మంది అభిప్రాయం. మరో వైపు ఆగిపోయిన పాదయాత్రను మళ్లీ ఎప్పుడు ప్రారంభించాలన్న దానిపై ఆమెకు క్లారిటీ లేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పాదయాత్ర చేయలేదు. అంతే కాదు.. టీవల వైఎస్ జయంతి రోజున పాలేరులో సభ పెడితే రెండు వందల మందిని కూడా సమీకరించలేకపోయారు.

ప్రస్తుతానికి ఆమె పేరుతో మీద.. టీఆర్ఎస్ సర్కార్ ను విమర్శిస్తూ .. రోజుకో ట్వీట్ పెడుతున్నారు తప్ప..క్షేత్ర స్థాయిలో ఎలాంటి కార్యక్రమాలు లేవు. అన్ని పార్టీలు రాజకీయంగా యాక్టివ్ గా మారిపోయాయి. కానీ బరిలోకి దిగి ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో షర్మిల ఉండిపోయిన సూచనలు కనిపిస్తున్నాయి. ఏపీలో రాజకీయాలు చేయాలనకు?ంటే మాత్రం అక్కడ రెడ్ కార్పెట్ వేస్తారని.. నిర్ణయం తీసుకోవాల్సింది ఆమెనని.. కాంగ్రెస్ వర్గాలు సంకేతాలు పంపుతున్నాయి.

# జేపీ నడ్డాతో బండి సంజయ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

సన్మానించారు. పార్టీ నూతన జాతీయ ప్రధానకార్యదర్శి రాధామోహన్ అగర్వాల్ తో కలిసి 15 నిమిషాలపాటు నడ్డాతో సమావేశమై యారు. బండి మాట్లాడుతూ జాతీయ నాయకత్వం ఆదేశాల ప్రకారం పార్టీ బలోపేతానికి కృషి చేస్తా. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం. హైకమాండ్ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధమని అన్నారు.

## టెట్.. సెట్‌లకు

# అంతా రెడీ

(మొదటిపేజీ తరువాయి)

సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పరీక్ష నిర్వహణపై కసరత్తు ప్రారంభించిన విద్యాశాఖ? అభ్యర్థులకు కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ పరీక్షను సెప్టెంబర్ మూడోవారంలో నిర్వహించాలని రాష్ట్ర విద్యాశిక్షణా పరిశోధన సంస్థ (ఎస్సీఈఆర్టీ) నిర్ణయించింది. మరో వారం రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావటంతో టెట్ నిర్వహణపై విద్యాశాఖ వేగం పెంచింది. సెప్టెంబర్ 15 లోపు లేదా ఆ తర్వాత రోజుల్లో పరీక్షను నిర్వహించాలని భావిస్తోంది. ఇప్పటికే పరీక్ష నిర్వహణపై ఓ అంచనాతో ఉన్న అధికారులు? ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. నోటిఫికేషన్ జారీ, దరఖాస్తుల స్వీకరణ, ఇతర ప్రక్రియలు కలిపి పరీక్ష రోజు నాటికి ఎంత సమయం పడుతుందనే దానిపై కూడా సర్కార్ కు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫలితాల వెల్లడికి 20 రోజులకు పైబడి టైం పట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నట్లు సమాచారం. గతేడాది మార్చి 24న నోటిఫికేషన్ జారీ చేయగా.. పరీక్షను జూన్ 27న నిర్వహించిన సంగతి తెలిసిందే. తాజా టెట్ నిర్వహణతో అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చే అకాశం ఉందిఇక రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016 మే 22, 2017 జులై 23, 2022 జూన్ 12న టెట్ పరీక్షలు నిర్వహించారు. ఇప్పటికే ఏడాది గడుస్తున్నందున మళ్లీ టెట్ జరపాల్సి ఉంది. ఏడాది కాలంలో డీఈడీ, బీఈడీ ఉత్తీర్ణులైన వారు 20వేలకు పైగా ఉన్నారు. గత కొంతకాలంగా మరో టెట్ నిర్వహించిన తర్వాతే డీఎస్సీ పరీక్షను జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు అశావాహులు. ఈసారి నిర్వహించబోయే పరీక్షకు కూడా దాదాపు 3 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.నిబంధనల ప్రకారం డీఎడ్, బీఎడ్ పాసైన వారు టెట్‌లో ఉత్తీర్ణులైతేనే ఉపాధ్యాయుల నియామకానికి నిర్వహించే టీఆర్‌టీ పరీక్ష రాయడానికి అర్హులవుతారు. టెట్‌లో వచ్చిన మార్కులకు టీఆర్‌టీ ర్యాంకింగ్‌లో 20 శాతం వెయిటేజీ ఉన్నందున టెట్‌లో అత్యధిక మార్కులు దక్కించుకోవడానికి అభ్యర్థులు పోటీపడుతుంటారు. టెట్ లో అర్హత లేకపోతే ఈ పరీక్షలకు హాజరుకాలేరు.పైగా టెట్ ఉత్తీర్ణత లేకపోతే ప్రైవేటు పాఠశాలల్లో కూడా బోధన చేయడానికి వీలుండదు.

### ఉస్మానియా నోటిఫికేషన్

తెలంగాణ సెట్ 2023 నోటిఫికేషన్ ను ఉస్మానియా వర్సిటీ విడుదల చేసింది. అక్టోబర్ లో పరీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ సెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఏడాది టీఎస్ సెట్ ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ల ఉద్యోగాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చు. సెట్ ను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులతో నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో మూడు గంటల పాటు పరీక్ష నిర్వహించనున్నారు. టీఎస్ సెట్ నోటిఫికేషన్‌తో పాటు ఇతర సమాచారం కోసం వెబ్‌సైట్లను విజిట్ చేయవచ్చు. ఈ ఏడాది అక్టోబర్ లో టీఎస్ సెట్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది మార్చి 14, 15, 17వ తేదీల్లోనూ టీఎస్ సెట్ పరీక్షను నిర్వహించింది ఉస్మానియా యూనివర్సిటీ. ఈ సెట్ పరీక్షలకు మొత్తం 50,256 మంది అప్లై చేసుకోగా, 40,128 మంది హాజరయ్యారు.

# గులాబీ గూటికి మరాఠ నేతలు

(మొదటిపేజీ తరువాయి)

రంగలోకి దింపనున్నట్లు స్పష్టంగా కనబడుతుంది. అయితే ఎన్నికలు దగ్గిరికొస్తున్నందున ఇంకా ఏ రాష్ట్రాల్లోని నాయకులు బీర్ఎస్‌లో చేరుతారని ఆసక్తి నెలకొంది.

### ఆగస్ట్ 1 మహారాష్ట్రకు కేసీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగస్ట్ 1న మహారాష్ట్రలో పర్యటించనున్నారు. మహారాష్ట్ర దళిత నేత అన్నా బావ్ సాటే జయంతి ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొననున్నారు. అనంతరం కొల్లాపూర్ లోని మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుంటారు. ఆ తర్వత సాహు మహారాజ్ మనవడిని కేసీఆర్ కలవనున్నారు. అనంతరం హైదరాబాద్ నగరానికి తిరుగు పయనం అవుతారు. మహారాష్ట్రలో కేసీఆర్ ఒక్కరోజు పర్యటన చేయనున్నారు.

## సంపాదకీయం

# మాస్టర్ ప్లాన్ అస్త్రంతో కలుషితం

పట్టణాల అభివృద్ధికి సిమెంట్, ఇసుక ఇంకా ఇతర అనేక ఖనిజాలు మైనింగ్ చేస్తున్నారు. వెలుగు జిలుగుల నగరాల కొరకు నిరంతరంగా విద్యుత్ అందించటానికి బొగ్గు మైనింగ్ చేస్తున్నారు. రోడ్లు, భవనాల నిర్మాణానికి నగరాల చుట్టూ ఉన్న గుట్టలను తొలుస్తున్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు నల్లా తిప్పితే నీళ్ళు అందించటానికి ఆనకట్టల నుంచి కోట్ల లీటర్ల నీటిని తరలిస్తున్నారు. ఒక వినిమయ సంస్కృతికి కావలసిన అన్ని హంగులు ఇతర ప్రాంతాల సహజ వనరుల వినియోగం జరుగుతోంది. అయితే, ఇలాంటి నగరం నుంచి వెలువడే గాలి కాలుష్యం భూతాపం పెరగడానికి, స్థానికంగా ‘హీట్ ఐలాండ్’ పరిణామం ద్వారా వాతావరణ మార్పులకు కారణం అవుతోంది. వినియోగం ఇక్కడ జరిగినా ఉత్పత్తి, మైనింగ్ ఇంకెక్కడో చేయాల్సి వస్తుంది. అక్కడి కాలుష్యం ఇక్కడి వినియోగం వల్లనే అని గుర్తిస్తున్నారు. కోట్ల లీటర్ల నీటిని మళ్లిస్తే అందులో 80 శాతం మురికి నీటిగా మారుతోంది. ఈ మురికి నీటిని నగరం బయటకు వదిలి చుట్టూ పక్కల పర్యావరణానికి, వ్యవసాయానికి హాని చేస్తున్నారు. వేరే ప్రాంతం నుంచి మంచి నీటిని తీసుకుని, మురికి నీటిని బయటకు వదిలే ప్రక్రియ ఒక ఇంటి వాళ్ళు చేస్తే దౌర్జన్యం అంటాం. ఒక నగరం చేస్తే అభివృద్ధి అంటాం. అదే ఆధునికతలో ఉండే ఒక విచిత్రం. ఈ నగరాలు రోజూ లక్షల టన్నుల చెత్తను ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ చెత్తను నగరం/ పట్టణాల బయట, చుట్టూ పక్కల పల్లెలలో గుట్టలుగా పేరుస్తున్నారు. తద్వారా అక్కడ పర్యావరణానికి విఘాతం ఏర్పడుతున్నది. ప్రతి మహా నగరం వల్ల చుట్టు పక్కల ఉండే పల్లెలు అనేక రూపాలలో బలి అవుతున్నాయి.నగరాల మీద పడే వర్షం నీటిని ఒడిసిపట్టుకునే వ్యవస్థ ఎక్కడ లేదు. అక్కడ పడే వర్షం ప్రతి చుక్క నేల మీద పడిన వెంటనే కలుషితం అవుతున్నది. ఈ కలుషితాల వరద నదులను, చెరువులను కలుషితం చేస్తోంది. వాటి మీద ఆధారపడిన వ్యవసాయదారులు, మత్స్యకారులు నష్టపోతున్నారు. భూగర్భ జలాలను సైతం ఈ నగరం/ పట్టణం వ్యవస్థలు కలుషితం చేస్తున్నాయి. నగరం విస్తృతి పేరిట పట్టణాభివృద్ధి చట్టాలను అడ్డుపెట్టుకుని పల్లెలను ఒక నోటిఫికేషన్ ద్వారా కలుపుకుంటున్నారు. పల్లె ప్రజల సమ్మతి అవసరం లేదు. పల్లెలకు రక్షణగా ఉండే చట్టాలు ఈ ‘సామ్రాజ్య’ విస్తరణను అడ్డుకోలేకపోతున్నాయి. న్యాయ వ్యవస్థ కూడా పట్టణాల సామ్రాజ్య విస్తరణకు మద్దతు ఇస్తుంది. భారత రాజ్యాంగంలో 73, 74 సవరణ అధికరణాలు గ్రామాలు, పట్టణాలలో ప్రజాస్వామ్యబద్ధ స్థానిక పాలన కొరకు ఉన్నాయి. కానీ.. గ్రామాలు తమ ఉనికిని కాపాడుకునే చట్టాలు లేవు. గ్రామాలను పట్టణాలలో విలీనం చేసే హక్కు పట్టణాలకు కల్పించిన చట్టాలు, గ్రామాల సమ్మతి అవసరాన్ని విస్మరించాయి. ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థలు ఈ లోపాన్ని గుర్తించి, సవరించాలి.పట్టణాల విస్తరణ, వనరుల భక్షణ సామ్రాజ్యవాద ధోరణికి భిన్నంగా లేదు. ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణకు అనేక దేశాల వనరులను దోపిడీ చేయడం, అనేక ప్రాంతాలను విలీనం చేసుకోవడం చరిత్రలో చూశాం. బ్రిటన్ తుపాకులను వాడితే, పట్టణాలు ఇప్పుడు మాస్టర్ ప్లాన్ ను ఒక ఆయుధంగా వాడుకుంటున్నాయి. పట్టణాలలో విలీనం అయినా.. పల్లెల గోస, పల్లెవాసుల కష్టం ఎవరికీ పట్టటం లేదు. పట్టణాలలో విలీనం అయిన తరువాత సౌకర్యాలు మెరుగుపడిన పల్లెలు చాల తక్కువ. భూమిలేని నిరుపేదల పరిస్థితి ఇంకా ఘోరం. పల్లె భూస్వాములు భూమి ధరలు పెరిగిన నేపథ్యంలో తమ ఆస్తులను పెంచుకున్నారు. కానీ.. చిన్న కమతందారులు ధరలు పెరిగిన మొదటి దశలోనే అమ్ముకుని ఆస్తులు పోగొట్టుకుని బికారులు అయినారు. అనేక అమాయక గ్రామీణ కుటుంబాలు మోసగాళ్ళ బారినపడి మొత్తం పోగొట్టుకున్నారు. విలీనం అయిన పల్లెలలో భూమి లేని కుటుంబాల సంఖ్య పెరిగింది. వారి నైపుణ్యానికి తగిన పని దొరకక వలసలు పెరిగాయి. పెంకుటిల్లు పోయి కాంక్రీట్ భవనాలు, రోడ్లు వచ్చాయి. మంచి నీళ్ళు, మురుగు నీరు వ్యవస్థలు ఏర్పడలేదు. వాహనాలు పెరిగాయి, కాలుష్యం వచ్చింది. తెలిసిన ముఖాలు తగ్గి కొత్త మొఖాలు రోజూ చూసుకునే పరిస్థితి వచ్చింది. చుట్టరికాలు, బంధుత్వాలు, స్నేహాలు తగ్గి తమ ఊర్లోనే ‘అపరిచితులు’ అయ్యారు.

వేడి ద్వీపం ప్రభావంతో పల్లెలలో పడాల్సిన వర్షం కూడా పట్టణాలలో మాత్రమే పడుతోంది. నగరాలలో పడిన వర్షపు నీటిని ఒడిసిపట్టుకునే పరివాహక వ్యవస్థ కాంక్రీటీకరణకు బలి అయ్యింది. నగరంలో పడ్డ ప్రతి వర్షపు చుక్క క్షణాలలో కలుషితం అవుతుంది. వర్షం వస్తే నగరాలలో తిట్టుకుంటారు. నగరవాసులకు నీళ్ళు నల్లాలోనే రావాలి. పైపుల ద్వారా పోవాలి. ఇంకే విధంగా వచ్చినా ఇబ్బంది పడతారు. చిరాకు ప్రదర్శిస్తారు. నగరాల్లో సహజ భూ భాగాన్ని కాంక్రీట్ మాయం చేస్తుంది. రోడ్లు, దట్టమైన భవనాలు, వేడిని గ్రహించి నిలుపుకునే ఇతర కాంక్రీట్ నిర్మాణాల వల్ల “అర్బన్ హీట్ ఐలాండ్స్” సంభవిస్తాయి. ఈ ప్రభావం వల్ల విద్యుత్ ఖర్చులు (ఉదా. ఎయిర్ కండిషనింగ్ కోసం), వాయు కాలుష్యం, ఉష్ణోగ్రతలు పెరిగి అనారోగ్యం పెరుగుతుంది. మరణాలు సంభవిస్తాయి.

నగరాలు ఉత్పత్తి కేంద్రాలుగా కాక వినిమయ కేంద్రాలుగా మారడానికి ఆధునిక ఆర్థిక వ్యవస్థ దోహదపడుతోంది. అందుకే.. పర్యావరణ మార్పులు, వాతావరణ మార్పుల మీద ఆలోచిస్తున్నవారు, నగరాల అభివృద్ధిని సహజ వనరుల మీద, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మీద దాడిగా భావిస్తున్నారు. భూతాపం తగ్గాలంటే, పర్యావరణం తిరిగి సమతుల్య స్థితికి రావాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మళ్లీ వేళ్ళూనుకోవాలి. గ్రామాలు బాగున్నప్పుడే దేశం సుస్థిరం అవుతుంది.

# మట్టి మనిషి “భాను చందర్ చెలిమిళ్ళ”

**పూర్వం ప్రజలు వ్యవసాయం, చేతి వృత్తుల పైనే ఆధార పడి జీవించేవారని మనందరికీ తెలుసు. మానవ నాగరికత పరిణామంలో విప్లవాత్మక మార్పుల ప్రక్రియలో, కొన్ని వృత్తులు కనుమరుగవుతున్నాయి మరియు వాటి స్థానంలో కొత్త పద్ధతులు కనుగొన బడు తున్నాయి. కనుమరుగవుతున్న చేతివృత్తులలో కుమ్మరి వృత్తి ఒకటి.**



కుమ్మరి మట్టితో ప్రయోగాలు చేసి మట్టి పాత్రలకు జీవం పోసి మానవ జాతికి తొలి సాధనాన్ని అందించడమే కాక దానిని నిత్యావసర వస్తువుగా మార్చిన ఘనత కుమ్మరి కే దక్కుతుంది. గతంలో ఈ వృత్తి కి ఎంతో ప్రాధాన్యత ఉన్నప్పటికీ నేడు ప్రాధాన్యత తగ్గిపోవడంతో కుమ్మరి వృత్తి ని వదిలి అనేక కుటుంబాలు ఇతర పనులు చేసుకుంటుండగా మరికొందరు కుమ్మరి వృత్తి నే నమ్ముకుని దిన దిన గండంగా బతుకీడుస్తున్నారు.

“మన్నును నమ్ముకున్నోడు ఏనాటికి చెడిపోడు” అనే నానుడి నిజం చేయాలనుకున్నాడో ఏమో తెలియదు కానీ తన తాత, తండ్రి చేసే కుమ్మరి వృత్తినే వారసత్వ సంపదగా పుణికిపుచ్చుకుని నేర్చుకున్నాడు. కుమ్మరి వృత్తి అంతరించిపోతున్నప్పటికీ మన్ను నే నమ్ముకుని వృత్తి ని బతికించడం కోసం బతుకీడుస్తున్న “భాను చందర్ ప్రజాపతి చెలిమిళ్ళ” నిజ జీవిత గాథ ఎందరికో ఆదర్శం.

**జననం, విద్యాభ్యాసం:**

హైదరాబాద్‌లోని చార్మినార్, రెయిన్ బజార్ కుమార్‌వాడి కాలనీ నిరుపేద కుటుంబానికి చెందిన చెలిమిళ్ళ యాదయ్య మరియు నర్సమ్మ దంపతులకు 23.05.1991 న జన్మించారు. తన చిన్ననాటి నుండి తండ్రి పడుతున్న కష్టాలు చూసి తండ్రికి సాయం చేస్తూ వృత్తిని నేర్చుకోగలిగాడు. భాను చందర్ పదేళ్ల వయసులో తండ్రి అనారోగ్య కారణాలతో ఏ పని చేయలేని స్థితిలో ఉన్నప్పుడు కుటుంబ పోషణ కోసం ఆరో తరగతి మధ్యలోనే చదువు మానుకొని భాను చందర్ తన తండ్రి వృత్తిని అనుసరించడం ప్రారంభించాడు.

**మానవజాతి మనుగడకు మట్టి కుండ మరువలేని సేవలందించింది.**

మానవజాతి మనుగడకు మట్టి కుండ ఎంతో మేలు చేసిందనడంలో అతిశయోక్తి లేదు. మనిషి పుట్టుక, చావు, దైవ కార్యాలకు కుండ ఎంత ఉపయోగమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మానవ జాతికి తొలి పనిముట్టును అందించడమే కాక జీవనానికి అత్యవసర నిత్యావసర వస్తువుగా సేవలందించిన మట్టి కుండ మాయమవుతుండటం బాధాకరమైన విషయం. ఎప్పుడైతే మార్కెట్లోకి ఫ్రిజ్ లు వచ్చాయో ఈ కుమ్మరి కుండలకు ఆదరణ గణనీయంగా తగ్గింది. ఫ్రిజ్‌లో నీటి కంటే మట్టి కుండల్లోని నీళ్లను తాగితే ఆరోగ్యంగా మంచి ఫలితాలు ఉంటాయని పలు పరిశోధకుల అభిప్రాయం. కానీ ఉరుకులు పరుగుల జీవితాలకు అలవాటు పడిన కొందరు కుండ వాడటానికి విముఖత చూపుతున్నారు. అంతేగాక ఇంటి పైకప్పు కోసం కూడా మట్టితో తయారు చేసిన పెంకులనే వాడేవారు. పెంకుటిళ్లలో ఎండాకాలంలో చల్లగా, చలి కాలంలో వెచ్చగా ఉండడం ఆ ఇళ్లలో నివసించే వారికి మాత్రమే తెలుస్తుంది. కాలక్రమేణా సిమెంట్ వాడకం పెరగడంతో గ్రామాల్లో సైతం పెంకుటిళ్ళు అంతరించిపోతున్నాయి.

పర్యావరణానికి ముప్పు కలిగించడంతో పాటు సమస్త జీవరాసులపై దుష్ప్రభావం చూపే ప్లాస్టిక్ వస్తువులు విరివిగా మార్కెట్లను ముంచెత్తుతుండడంతో కుమ్మరులు తయారు చేసే మట్టి పాత్రలకు ఆదరణ కరువైంది. కుమ్మరులు ఒకప్పుడు ఊరి చెరువులో నుంచి తామే స్వయంగా మట్టి తెచ్చుకుని తక్కువ ఖర్చుతో కుండను తయారు చేసినప్పటికీ అప్పట్లో బాగా గిరాకీ ఉండడంతో లాభసాటిగా ఉండేది. కానీ ఈ రోజుల్లో రోజంతా కష్టపడి కుండలు చేస్తే కనీసం రోజుకు 200 రూపాయలు కూడా గిట్టుబాటు కావడం లేదు. అయినా సరే వృత్తి పై మమకారంతో అమ్ముకుందామంటే గిరాకీ ఉండటం లేదు. బతుకుదెరువు కోసం ఇతర వృత్తుల పై ఆధారపడి జీవనం సాగించాల్సిన పరిస్థితులు నెలకొనడంతో వృత్తినే నమ్ముకున్న కుమ్మరి జీవితం నేడు అగమ్యగోచరంగా తయారైంది.

ఎంతో కళానైపుణ్యం తో కూడుకున్న కుమ్మరి వృత్తి ఆదరణ కరువై ఇలా అంతరించిపోవడం అత్యంత బాధాకరమైన విషయం. ఇవ్వాళ కుమ్మరి వృత్తి జీవితం కుదేలయింది. స్టీల్, ప్లాస్టిక్, జర్మన్ సిల్వర్ వినియోగం విపరీతం గా పెరిగిపోవడంతో ఖాళీ కడుపుతో వెలవెల బోతోంది. కాలచక్రం తో పోటీ పడలేక మట్టి కుండ కనుమరుగైపోతోంది.

**మట్టి కోసం ఎన్నో ప్రయత్నాలు:**

గతంలో ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు తప్పనిసరిగా ఉండేవి. ఆ రోజుల్లో కుమ్మరికి కుండ తయారీకి ఎలాంటి ఖర్చు లేకుండా గ్రామ సమీపంలోని చెరువుల్లో ఒండ్రుమట్టి దొరికేది. ఎండా కాలంలో చెరువుల నుంచి ఒండ్రుమట్టిని సేకరించి కుండను తయారు చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేసి, ఆ మట్టిని నీటితో తడిపి కాళ్లతో మట్టిని మెల్లగా తొక్కి ముద్దలుగా చేసి ఎంతో ఓపికతో కుండను తయారు చేస్తారు. ఆ తర్వాత కుండను కాల్చడానికి కూడా అనేక పద్ధతులు ఉపయోగిస్తారు. ఎంతో ఓర్పు మరియు నైపుణ్యం లేనిదే కుండ తయారు చేయడం అసాధ్యం. ఎంతో శ్రమకోర్చి తయారు చేసిన మట్టి కుండ మానవాళికి తొలి వస్తువుగా ఉపయోగపడడం గొప్ప విషయం.

కానీ నేడు ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురై మట్టి కోసం కుమ్మరి అల్లాడుతుండటం బాధాకరమైన విషయం. ఒకప్పుడు ఉచితంగా లభించే మట్టి నేడు అందుబాటులో లేదు. మరికొందరు సుదూర ప్రాంతాల నుంచి మట్టిని కొనుగోలు చేసి కుండలు తయారు చేసిన గిట్టుబాటు ధర లేక కుటుంబాన్ని పోషించుకోలేక కుమ్మరి వృత్తికి దూరమవుతున్నారు.

హైదరాబాద్ నగరంలో ఉంటున్న భాను చందర్.. తాను నమ్ముకుని బతుకుతున్న వృత్తినే కొనసాగించాలని పట్టుదలతో ఉన్నాడు. భాను చందర్ లాంటి వాళ్ళు ఉండడం వల్ల ఈ వృత్తి పూర్తిగా అంతరించి పోకుండా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు.

భాను చందర్ కుటుంబ పోషణ కోసం అనేక ఇబ్బం దులు పడుతున్నా, అనేకమంది ఆధునిక పరికరాలు, ఆధునిక యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ మట్టి కుండ ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పాలనే ఉద్దేశంతో భాను చందర్ నగరంలో పలుచోట్ల ప్రదర్శనలు ఇస్తున్నారు. మట్టి కుండ మానవ ఆరోగ్యానికి మంచిదని, మట్టి కుండను ఉపయోగించకపోవడం వల్ల మానవుడు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని అందరికీ వివరిస్తున్నారు. అంతేకాకుండా, అతని కుండ తయారీని చూసి చాలా మంది ప్రముఖులు, నాయకులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, సినీ తారల చే ప్రశంసలు అందుకుంటున్నారు.

**ప్లాస్టిక్ వాడకం వద్దు. మట్టి కుండలు ముద్దు.**

ప్లాస్టిక్ వస్తువులు అత్యంత అందంగాను, కళ్లు చెదిరే రంగులతో మరియు అత్యంత చౌకగా చౌకగా ఉంటాయి కాబట్టి ప్లాస్టిక్ వస్తువు లను ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. విచక్షణా రహితంగా రసాయనాలు వాడడం, ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్లాస్టిక్ వస్తువులను విపరీతంగా వాడడంతో పర్యావరణం ప్రశ్నార్థకంగా మారింది. ఇలాగే కొన సాగితే భావి తరాలు అనారోగ్యకరమైన సమాజంలో జీవించాల్సి వస్తుంది.

పూర్వం మట్టి కుండలో ఆహారాన్ని వండుకుని తినే వారు. కాబట్టి వారు చాలా ఆరోగ్యంగా ఉన్నారు. అంతే కాకుండా మట్టి కుండలో నీళ్లు తాగడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. చల్లటి నీళ్ల కోసం ఫ్రిజ్, వాటర్ ప్యూరిఫైయర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులలో నీటిని నిల్వ ఉంచుకుని తాగే బదులు మట్టి కుండలో నీటిని నిల్వ చేసుకుంటే సహజంగా చల్లబడి ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకుని ప్లాస్టిక్ ను నిషేధించి మట్టి కుండలకు ప్రాధాన్యత ఇవ్వడం మంచిది.

**కుమ్మరి వృత్తికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు “స్వదేశీ ఉత్పత్తుల” అభివృద్ధికి, గ్రామీణ వృత్తుల ఆధునికీకరణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో విఫలమైంది అనడంలో సందేహం లేదు. కుమ్మరి వృత్తి డిమాండ్ తగ్గడంతో గ్రామీణ వృత్తులపై ఆధారపడిన కార్మికులు ఈ వృత్తిని వదులుకుని పట్టణాలకు వలస వెళ్లి లేబర్ మార్కెట్‌లో రోజువారీ కూలీలుగా ఎక్కువ గంటలు పని చేస్తూ తక్కువ వేతనాలు పొందుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

**భానుచందర్ ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది**

కిన్నెర కళాకారులు అంతరించిపోతున్న తరుణంలో కళనే నమ్ముకుని బతుకీడుస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన 12 మెట్ల కిన్నెర కళాకారుడు దర్శనం మొగులయ్య కు భారత ప్రభుత్వం 2022 లో పద్మశ్రీ పురస్కారాన్ని అందించడం గొప్ప విషయం. అలాగే అంతరించిపోతున్న కుమ్మరి వృత్తి కళాకారులను కూడా ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయం. కుండ విశిష్టతను తెలియజేస్తూ కళను బతికిస్తున్న భాను చందర్ లాంటి వారిని ప్రభుత్వం సత్కరించి తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- వ్యాసకర్త
కోట దామోదర్
మొబైల్:
9391480475

# కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఈడీ కేసు

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**



హర్యానా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ధరమ్ సింగ్ చొక్కర్‌తో పాటు అతని కంపెనీలకు చెందిన ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. మనీల్యాండరింగ్ కేసులో ఆయన్ను విచారిస్తున్నారు. అయితే ఇవాళ ఆ ఎమ్మెల్యేకు చెందిన నాలుగు లగ్జరీ కార్లతో పాటు 14.5 లక్షల విలువైన జ్యువలరీ, 5 లక్షల నగదును ఈడీ సీజ్ చేసింది. ఇండ్ల కొనుగోలుదారులన మోసం చేసినట్లు ఎమ్మెల్యే ధరమ్ సింగ్‌పై ఆరోపణలు ఉన్నాయి.ధరమ్ చోకర్ కుటుంబానికి చెందిన సభ్యులు సాయి అయినా ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ కంపెనీ నడుపుతున్నారు. దాంట్లో మహిరా ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ కూడా ఉంది. సామల్కా, గురుగ్రామ్, ఢిల్లీ నగరాల్లో ఈడీ తనిఖీలు చేసింది. 1497 మంది కొనుగోలుదారుల నుంచి సుమారు 360 కోట్లు వసూల్ చేసినట్లు సాయి అయినా ఫార్మ్స్ కంపెనీపై గురుగ్రామ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తనిఖీల సమయంలో చోకర్ కుటుంబసభ్యులు దర్యాప్తులో పాల్గొనలేదని ఈడీ పేర్కొన్నది.

# పేదలకు ఇండ్లు అందించేవరకు పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

సాగుతుంది . రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి పేదలను మోసం చేసింది. కేంద్రం ‘పీఎం ఆవాజ్ యోజన’ కింద ఇచ్చే నిధులను ఏం చేస్తున్నారు. ఇండ్లు కట్టరు.. కట్టిన వాటిని అర్హులకు పంచరు. కట్టిన ఇండ్లు పాడవుతున్నా పేదలకు ఇవ్వకపోవడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమని అన్నారు. కిషన్ రెడ్డికి శంషాబాద్ లో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

# వలస బాట పడుతున్న మణిపూర్ వాసులు

(మొదటిపేజీ తరువాయి)

చంటిబిడ్డల తల్లులూ ఉన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలను తలుచుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నారు. “అక్కడి దారుణాలు చూశాక ఇప్పటికీ నా వెన్నులో వణుకు పుడుతోంది. మా ఇంటి గేట్ చాలా పాతది. ఎప్పుడు ఎవరు వచ్చి దాన్ని కూల్చేస్తారో లోపలికి వస్తారో అని భయపడిపోయాం. అందుకే అక్కడి నుంచి వచ్చేశాం. ఇక్కడే మా బంధువుల ఇంట్లో తల దాచుకుంటున్నాం. ఈ పాటికి మా ఇంటిని తగలబెట్టేసి ఉంటారు. వాళ్లంతా వచ్చి దాడులు చేస్తుంటే పోలీసులు పక్కనే ఉండి ఏమీ పట్టనట్టుగా ఉన్నారు. కేవలం వాళ్లను చూస్తూ ఉండిపోయారు. వాళు ఎందుకలా చేస్తున్నారో మాకు అర్థం కావడం లేదు. ఇళ్లు తగలబెట్టొద్దు అని మాత్రమే చెబుతున్నారు తప్ప పోలీసులు వాళ్లను అడ్డుకోవడం లేదు”ఎన్నో ఏళ్లుగా ఉంటున్నప్పటికీ మణిపూర్ తమకు సురక్షిత ప్రాంతం కాదని కుకీలు భావిస్తున్నారు. ఎలాగోలా బతికి బయట పడితే చాలు అనుకునే పరిస్థితులు వచ్చాయి. నాగాలాండ్ నుంచి మళ్లీ మణిపూర్‌కి వస్తారా అన్న ప్రశ్నకు వాళ్ల దగ్గర సమాధానం లేదు. తమ భవిష్యత్ ఏంటో అర్థం కావడం లేదని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. విద్యార్థుల పరిస్థితైతే మరీ దారుణంగా ఉంది. ఉన్నట్టుండి అర్ధరాత్రి తమ ఇళ్లపై దాడులు మొదలయ్యాయని, అప్పటికప్పుడు అన్నీ వదిలేసి నాగాలాండ్‌కి వచ్చామని వివరిస్తున్నారు. చదువుకోడానికి వీల్లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం జోక్యం చేసుకుని శాంతియుతంగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. చాలా మంది బాధితుల ఇళ్లు మంటల్లో కాలి బూడిదైపోయాయి. అందుకే రెండు రోజుల పాటు కొండ ప్రాంతాల్లో నడుచుకుంటూ నాగాలాండ్‌కి చేరుకుంటున్నారు. కొంత మంది పొలాలనూ మైతేయి వర్గ ప్రజలు లాక్కుంటున్నారు. వందలాది ఇళ్లు బూడిదయ్యాయి.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్**



తుర్కయంజాల్ - ప్రభాత సూర్యుడు

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో, కలుషిత నీటితో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. సోమవారం పారిశుద్ధ్య విభాగంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన పారిశుధ్య జాగ్రత్తలపై సమీక్ష జరిపారు. ప్రజలందరూ వేడిచేసి చల్లార్చిన నీటినే త్రాగాలని, త్రాగునీరు అపరిశుభ్రంగా కాకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటింటా చెత్త సేకరణ క్రమం తప్పకుండా చేయాలని, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చాలని, అత్యవసరం ఉన్నచో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సీజనల్ వ్యాదులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశమున్నందున దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో, ఖాళీకుండీలలో, పాతటైర్లలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని, దోమ లార్వాలను నివారించే రసాయనాలను, బ్లీచింగ్ పౌడర్ని వాడాలని సూచించారు. త్వరలో వైద్య విభాగా అధికారులతో కూడా సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరసింహులు, శానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ భానుమతి , జవాన్లు పాల్గొన్నారు.

## 160 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

మేడ్చల్- ప్రభాత సూర్యుడు

ఉపాధి కల్పనలో తెలంగాణ దేశానికే రోల్‌మాడల్‌గా నిలుస్తుందని, స్వరాష్ట్రంలోనే మహిళ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, పాలన దక్షతలో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతోనే.. ప్రతి రంగంలో మహిళామణులు దూసుకెళ్తున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) వారి ఆధ్వర్యంలో 160మంది మహిళలకు కట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం తెలంగాణకే వలస వస్తున్నారని, మహిళలు స్వయం కృషితో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవని, మహిళల రక్షణకోసం షీటీమ్స్‌ను ఏర్పాటు చేశారని, అమ్మాయిల చదువు కోసం ప్రత్యేకంగా గురుకులాలు నెలకొల్పిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. మహిళలు కుట్టు మిషన్‌లో ప్రత్యేకతను కనబర్చి, ఇతరులకు ఉపాధిని కల్పించి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు ఏకే మురుగేష్, లలితాయాదవ్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, నిహారికగౌడ్, మెట్టు ఆశాకుమారి, లావణ్యసతీష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, శారదామనోధర్‌రెడ్డి, పల్లపు రవి, వేణు, కోఆప్షన్‌సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, న్యాక్ అధికారులు, నాయకులు సాధిక్, ప్రకాష్, నవీన్‌యాదవ్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సూర్యాపేట జిల్లాలో విషాదం

## ట్రాక్టర్ డ్రైవర్ కు మూర్ఛ..ఇద్దరు మృతి

సూర్యాపేట- ప్రభాత సూర్యుడు



సూర్యాపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అర్వపల్లి మండలం, పరసాయిపల్లి గ్రామంలో రామలింగయ్య అనే ట్రాక్టర్ డ్రైవర్ పొలం దున్నుతుండగా.. ఫిట్స్ తో డ్రైవర్ సీట్లోనే మృతి చెందాడు. అదే సమయంలో.. పొలం గట్టు మీదున్న మల్లయ్య అనే రైతు మీదకి ఫుల్ వీల్ తో ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా దూసుకెళ్లడంతో.. మల్లయ్య అనే రైతు సైతం మృతి చెందాడు. దీంతో.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పార్టీ మారే అలోచన లేదు

సూర్యాపేట- ప్రభాత సూర్యుడు

తాను పార్టీ మారుతున్నాననీటూ వస్తున్న పుకార్లపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ తో పాటు సొంత పార్టీ నాయకులే దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. నాలుగు తరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న.. నాలాంటి వ్యక్తిపై దుష్ప్రచారం జరగడం దురదృష్టకరం. నా పుట్టుక కాంగ్రెస్.. చివరి శ్వాస వరకు కాంగ్రెస్ లోనే. ప్రజలు, కార్యకర్తలు ఎవరు దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎవరు సంప్రదించలేదు. కాంగ్రెస్ టికెట్ పై సూర్యాపేట నుంచే పోటీ చేస్తా. టికెట్ నాదే.. గెలుపు నాదే. నాన్ లోకల్ అని ప్రచారం కరెక్ట్ కాదు. గతంలో చంద్రబాబు.. టీఆర్ఎస్ ఆవిర్భావ సమాయంలో కేసీఆర్ రమ్మని కోరినా వెళ్ళలేదు. నాకు గ్రూపులు లేవు.. నాది కాంగ్రెస్ గ్రూపు.. సోనియా గ్రూపని అన్నారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ వివరాలు ఆగస్టు-5 వరకు పంపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలలో తమ ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత 5 సంవత్సరాలుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం చక్కని వేదికగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్రంలో ఇన్నోవేషన్, సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, తెలంగాణలోని మొత్తం 33 జిల్లాలు ఒకేసారి ఆయా జిల్లాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శనను నిర్వహిస్తున్నా యని, ఈ ప్రదర్శన జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనడానికి అన్ని రంగాల, వర్గాల ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని, గ్రామీణ ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు , సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలు మొదలగునవి అంగీకరించబడతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణకు సంబంధించిన 6 వాక్యాలు, 2 నిమిషాల వీడియోను, ఆవిష్కరణ యొక్క 4 ఫోటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నెంబర్, వయసు, ప్రస్తుత వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరు తదితర వివరాలను సెల్ నంబర్ 9100678543 కు వాట్సాప్ చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇన్నోవేటర్స్ నుండి దరఖాస్తులను స్వీకరించడానికి చివరి తేదీ ఆగస్ట్ 5 అని, అందుకున్న దరఖాస్తుల నుండి మొదటి షార్ట్‌లిస్ట్ తరువాత 5 ఆవిష్కరణలు ప్రదర్శనకు ఎంపిక చేయబడుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ టి.ఎస్.దివాకర్


జగిత్యాల - ప్రభాత సూర్యుడు





ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ టి.ఎస్. దివాకర్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 01 నుండి 07 వరకు నిర్వహించే ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ఎస్ఏజీ మెంబర్లు, మెప్మా అధికారులు సమన్వయం చేసుకొని వెళ్లి గర్భవతిగా ఉన్న మహిళకు తల్లి పాల యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి వారిని మోటివేట్ చేయాలని సూచించారు. బ్రెస్ట్ ఫీడింగ్ లో మన జిల్లా 24 % మాత్రమే ఉందని, దానిని పెంచే బాధ్యత అధికార యంత్రాంగం మీదే ఉందని ఆయన అన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ ఆర్గనైజేషనలు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నాయనే వీడియోల రూపంలో తీసి తమకు పంపించాలని ఆయన అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా నిర్వహించే ప్రతీ కార్యక్రమాన్ని ఒక ప్రోఫార్మాలో తయారు చేసి నివేదికలు సమర్పించాలని అన్నారు. సోషల్ మీడియాలో ప్రచారం చేయడానికి ఆడియో క్లిప్స్ మరియు వీడియో క్లిప్స్ రూపొందించామని తెలిపారు. పిల్లలు పుట్టగానే ముందుగా వారికీ తల్లి పాలు తాగించాలని, పిల్లలు భూమికి వచ్చిన తర్వాత వారికీ ఈ వాతావరణాన్ని తట్టుకునే శక్తి ఉండదని, అది కేవలం తల్లి పాలు తాగించడం వల్ల మాత్రమే సాధ్యమని ఆయన తెలిపారు. సాధారణ ప్రసవాలు కాకుండా ముహూర్తాలు చూసుకొని సిజేరియన్ ఆపరేషన్ చేయించుకోవడం వల్ల సమయానికి పిల్లలకు తల్లి పాలు అందక బ్యాక్టీరియాలు, ఇన్ఫెక్షన్లు వచ్చి ఎక్కువగా శిశు మరణాలు సంభవిస్తున్నాయని, అలా జరుగకుండా సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భవతి మహిళలను ప్రోత్సహించి తల్లి పాల వలన కలిగే ప్రయోజనాలను తెలియజేయాలని అన్నారు. అలాగే జిల్లాలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో కూడా తల్లి పాల వలన పిల్లలకు కలిగే ప్రయోజనాల గురించి గర్భవతి మహిళలకు తెలియజేసే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీధర్,సీడీపీవో లు, మెప్మా అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్ధ సారథి దంపతులు



జగిత్యాల - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్ధ సారథి దంపతులు, కుటుంబ సభ్యులు సోమవారం రోజున కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కమిషనర్ దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద మంత్రాలతో పూజా కార్య క్రమాలు నిర్వహించి, ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు. అనంతరం బేతాళ దేవాలయం ను సందర్శించి పూజలు నిర్వహించారు. కమిషనర్ కు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, డీపీఆర్వో ఎన్.భీమ్ కుమార్, రెవెన్యూ, దేవాదాయ అధికారులు స్వాగతం పలికారు. మొదట పోలీసు గౌరవ వందనం స్వీరించారు.

## మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

జగిత్యాల - ప్రభాత సూర్యుడు

మహిళల రక్షణకై, వారి చట్టాలపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల పై జరిగే నేరాలపై పోలీసులకు సంప్రదించ వలసిన తీరుపై, షీ టీం యొక్క పనితీరు గురించి పట్టణంలోని ఇస్లాం పుర అంగన్వాడీ టీచర్లులకు అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా షి టీం, సిసిఎస్ ఇన్స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల రక్షణకై వారిపై జరుగు నేరాలను అరికట్టడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు షీ టీం పని చేస్తుందని అన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నేరాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుండి మహిళల రక్షణ కొరకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం నెంబర్ కి 8712670783 సంప్రదించాలని అన్నారు. కార్యక్రమం లో షీ టీమ్ ఎస్.ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్సైవాలీబెగ్, మహిళా కానిస్టేబుల్ లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## బీజేపీ ఆందోళన

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

కేంద్రం నిధులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పనులు చేయించడంలో జాప్యం వహిస్తుంది అని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. ఉప్పల్ ఎలివేషన్ కారిడార్ పనుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉప్పల్ రింగ్ రోడ్డు నుండి ఏషియన్ తియేటర్ వరకు బీజేపీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ అంబర్ పెట్ నుండి నారపల్లి వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ పనుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న స్థలాల లబ్ధిదారులకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదని తెలిపారు. కరెంట్ ,డ్రైనేజీ తొలగిపు విషయంలో,రోడ్ల మరమ్మత్తులు విషయంలో విఫలం అయ్యిందని అన్నారు. ఇక్కడి ఎంపీ ఏనాడు ఈ కారిడార్ విషయంలో కేంద్రంతో మాట్లాడింది లేదు. కానీ మోడీ,గట్కారి లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ఇక్కడి రోడ్ల మరమ్మతులకు కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించవద్దు

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో శంషాబాద్ మండలంలోని మదనపల్లి వద్ద పురాతన ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించ రాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్థానికులు మొరపెట్టుకున్నారు. హైదరాబాద్ నుండి పాలమూరు పర్యటనకు బయలుదేరిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు శంషాబాద్ మండలంలోని మదనపల్లి వద్ద పురాతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆలయాన్ని తొలగించరాదని గ్రామస్తులతో పాటు స్థానిక బిజెపి నేతలు కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215